క్లుప్తంగా

మాజీ ఎంపీటీసీని శిక్షించాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిషిధర్‌రెడ్డి



మాట్లాడుతున్న నిషిధర్‌రెడ్డి

గణపురం: ఐకేపీ కొనుగోలు కేంద్రం నిర్వహిస్తున్న మహిళలపై దాడిచేసి గాయపరిచిన బుద్రకాయలగూడెం మాజీ ఎంపీటీసీ కాల్యా సాగర్, అతని కుటుంబ సభ్యులను కఠినంగా శిక్షించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషిధర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఊర నవీన్‌రావు డిమాండ్ చేశారు. బుద్రకాయలగూడెం గ్రామంలోని కొనుగోలు కేంద్రం నిర్వహిస్తున్న మహిళలను మంగళవారం వారు పరామర్శించి దాడి విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. గుండాగిరి చేస్తున్న సాగర్‌పై రౌడీ షీట్ ఓపెన్ చేయాలన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర నాయకుడు మంద మహేష్, మండల నాయకులు సోమ దామోదర్, మాదాసు మొగిలి, ప్రవీణ్, పెండ్యాల రాజు, సయ్యద్ గాలిఫ్, శంకర్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



చిట్యాల : మండలంలోని గోపాలపూర్ గ్రామానికి చెందిన అచ్చె భాస్కర్ తన సెల్‌ఫోన్‌ను ఇంట్లోంచి ఎవరో గుర్తు తెలియని వ్యక్తి తీసుకెళ్లాడని ఎనిమిది నెలల క్రితం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితుడికి మంగళవారం ఏఎస్సై సమ్మిరెడ్డి అందజేశారు. పోలీసులు సురేందర్, లాల్‌సింగ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

చిట్యాల : మండల కేంద్రంలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం నుంచి చింతలపల్లి, రాంనగర్, చిట్యాల మీదుగా హనుమాన్ మాలధారణ భక్తులు మంగళవారం హనుమాన్ స్వామి చిత్రపటంతో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ భక్తులు వేణుసింగ్, ఆకుల రాజు, హరీష్, మొగిలి, రాజు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి



భూపాలపల్లి అర్బన్ : సైబర్ నేరాలపై ఉపాధ్యాయులు సైతం అవగాహన కల్పించాలని స్థానిక ఎస్సై సాంబమూర్తి కోరారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి ఉపాధ్యాయుల శిక్షణ శిబిరంలో సాంబమూర్తి ఉపాధ్యాయులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికి సైబర్ క్రైంపై అవగాహన కల్పించాలని, గ్రామీణ ప్రాంతాల్లోని వారి కుటుంబ సభ్యులు నేరాల బారిన పడకుండా ఉంటారన్నారు.

సీపీఎం నిరసన ర్యాలీ



ర్యాలీగా వెళ్తున్న నాయకులు, కార్మికులు

భూపాలపల్లి రూరల్: సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాకేంద్రంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ర్యాలీ సీపీఎం కార్యాలయం నుంచి గణేష్ చౌక్ మీదుగా అంబేడ్కర్ సెంటర్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బందు సాయిలు మాట్లాడుతూ నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దుచేయాలన్నారు. పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని చెప్పారు. జూలై 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నూరి రమేష్, భూపాలపల్లి పట్టణ పేదల సంఘం కార్యదర్శి వెలిశెట్టి రాజయ్య, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు వంగాల విజయలక్ష్మి, రవికుమార్, మహేందర్, తిరుపతి పాల్గొన్నారు.

పశువులకు గ్రాసం గోస



బీడు భూమిలో మేత కోసం చూస్తున్న పశువులు



అకాల వర్షంతో మొలిచిన గడ్డిని మేస్తున్న పశువులు

మేత దొరక్క మూగరోదన

- ఎరగళ్లతో కాలిపోయిన గడ్డి
- అకాల వర్షాలతో కరువైన సేకరణ
- మేత లభించక అలమటిస్తున్న పశువులు

వాజేడు : గ్రాసం కోసం మూగజీవాలు అలమటిస్తున్నాయి. ప్రతీ ఏటా యాసంగి పంటలు అయిపోగానే రైతులు పశువుల కోసం మేతను సేకరించి నిల్వ చేస్తారు. ఈ ఏడాది పంటలు పూర్తి కాగానే మేతను సేకరించే పనిలో పశువుల రైతులు సిద్ధమయ్యారు. కాని వేసవి ఎండలు అధికంగా ఉండటంతో పంటలు పూర్తికాక ముందే ఎరగళ్లు (ప్రమాదవశాత్తు మంటలు అంటుకోవడం) పడడంతో చాలా వరకు గడ్డి కాలి బూడిదైపోయింది. దీంతో అన్నదాతలకు వరిగడ్డి సేకరణ కష్టసాధ్యంగా మారింది. ముందుగా తేరుకున్న కొందరు రైతులు మాత్రం ఎండు గడ్డిని నిల్వ చేసుకున్నారు. దీంతో పశువులకు మేత లభించే అవకాశం లేకుండా పోయింది.

కాలిపోయిన వరిగడ్డి..

వేసవిలో ఎండలు అధికంగా ఉండటంతో వరి పొలాలు కోత కోసిన వెంటనే ఎరగళ్లు పడ్డాయి. పొలాల్లో మంటలు చెలరేగడంతో వరిగడ్డి కుప్పలు కాలిబూడిదయ్యాయి. ఎక్కువ శాతం గడ్డి కాలిపోవడంతో పశువుల మేతకు కొరత ఏర్పడింది. పశువులు ఉన్న రైతులు మేత కోసం గాలిస్తున్నారు. అయితే పొలాల్లో ఎరగళ్లు వేయొద్దని అధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

వర్షంతో తడిసి పనికి రాని ఎండు గడ్డి..

పశువులను పెంచుకుంటున్న రైతులు ప్రతీ సంవత్సరం మేతను సిద్ధం చేసుకుంటారు. కాని ఈ ఏడాది మేత కోసం రైతులు ఊరూరా తిరగాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎక్కువగా బాండ్ వరికి చెందిన ఎండు గడ్డిని పశువుల మేత కోసం రైతులు సేకరిస్తుంటారు. ఈ గడ్డి తియ్యగా ఉండటంతో పశువులు సైతం ఎక్కువగా తింటాయని రైతుల నమ్మకం. కాని అకాల వర్షాలతో పొలాల్లోని గట్టి తడిసి ముక్కిపోయింది. దీంతో రైతులు ఆ గడ్డిని సేకరించడం లేదు. వర్షాలకు ముందుగా సేకరించడానికి సమయం లేకుండా పోయింది.

అన్నదాతల అయోమయం..

మేత లభించే అవకాశాలు లేకపోవడంతో పశువులకు మేతను ఎక్కడి నుంచి తీసుకు రావాలో తెలియని అయోమయ పరిస్థితుల్లో అన్నదాతలు పడ్డారు. ఉదయం లేవగానే పశువులను వదిలేస్తున్నారు. వాటికి మేత లభించే అవకాశం లేకపోవడంతో చెట్లు, పుట్టల వెంట తిరుగుతున్నాయి. పొద్దంతా రోడ్ల వెంట తిరిగి ఖాళీ డొక్కలతో తిరిగి ఇంటికి వస్తున్నాయి.వర్షాలు కు రిస్తేనే పశువులకు మేత లభించే అవకాశాలు ఉన్నాయి. అంత వరకు పశువులను ఎలా కాపాడుకోవాలో తెలియడం లేదని రైతులు వాపోతున్నారు.

క్షయవ్యాధి నివారణపై అవగాహన



వాజేడులో అవగాహన కల్పిస్తున్న వైద్యులు



వాజేడు: పేరూరులో..

వాజేడు : వాజేడు పల్లె దవాఖానాలో వైద్యాధికారి జ్ఞానస, పేరూరులో హెచ్‌ఈఓ వేణుగోపాల కృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఆశ కార్యకర్తలు గుర్తించిన 29 మంది అనుమానితులను వైద్యశాలకు తీసుకువచ్చారు. వారి నుంచి తెమడను సేకరించి పూర్తిస్థాయి పరీక్షల కోసం ములుగు పంపించారు. అనంతరం క్షయ వ్యాధి సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఎస్‌టీఎల్‌ఎస్ రవి, హెల్త్ సూపర్‌వైజర్ కోటిరెడ్డి, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, శ్రీను, శకుంతల, సతీష్, ల్యాబ్ టెక్నీషియన్ రజనీకాంత్, చిన్న వెంకటేశ్వర్లు, ఆశ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

రాయితీపై జీలుగ విత్తనాలు

వాజేడు : స్థానిక సహకార సంఘంలో రాయితీపై జీలుగ విత్తనాలు లభించనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు యగ్గడి అంజయ్య, మండల వ్యవసాయాధికారి ముంజ మహేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సహకార సంఘానికి 167 బస్తాల జీలుగ వచ్చినట్లు వారు పేర్కొన్నారు. 30 కేజీల జీలుగ బస్తా ధర రూ.2,138 ఉన్నట్లు వెల్లడించారు. కావాల్సిన రైతులు ఆధార్, పట్టా పాస్ బుక్ జిరాక్స్, ఫోన్ నంబర్‌తో సహకార సంఘంలో కొనుగోలు చేసుకోవాలని తెలియజేశారు. రైతులు పొలాల్లో, చేలల్లో సకాలంలో జీలుగ విత్తనాలను చల్లుకోవాలని సూచించారు.

నంది విగ్రహ ప్రతిష్ఠాపన



నంది విగ్రహం వద్ద పూజలు చేస్తున్న రవిచందర్ దంపతులు

ములుగు రూరల్ : మండలంలోని దేవగిరిపట్నం గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో మంగళవారం నంది విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. నంది విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామకమిటీ అధ్యక్షుడు భద్రునాయక్, బాలబ్రహ్మచారి కిషన్ మహారాజ్, సమ్మయ్య, భక్తులు పాల్గొన్నారు.

నామినేషన్ పత్రాల అందజేత



నామినేషన్ పత్రం అందజేస్తున్న అనిల్ కుమార్

గోవిందరావుపేట : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష పదవికి ఐదుగురు నామినేషన్లు దాఖలు చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా ఇన్‌చార్జ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కైలాష్ నేతను అనిల్ కుమార్ యాదవ్ నామినేషన్ పత్రాన్ని అందించారు. చింత క్రాంతి, పాలడుగు వెంకటకృష్ణ రసపుత్ సీతారాం నాయక్, శ్రీనివాస్‌రెడ్డిలు నామినేషన్ పత్రాలు అందజేశారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

వెంకటాపురం(ఎం) : మండలంలోని పాలంపేట శివారులో గల నల్లకాల్వ మూల మలుపు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మట్టెవాడ నరేష్(30) చికిత్స పొందుతు మంగళవారం మృతిచెందాడు. ములుగు మండలంలోని బరిగలపల్లె గ్రామానికి చెందిన నరేష్ ఆదివారం రామప్ప ఆలయాన్ని సందర్శించేందుకు వస్తున్నాడు. ఈ క్రమంలో నల్లకాల్వ మలుపు వద్ద ట్రాక్టర్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం హనుమకొండలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం మంగళవారం హైదరాబాద్‌కు తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పండ్ల పంపిణీ

గోవిందరావుపేట : దివంగత డాక్టర్ అన్నవరం కృష్ణమూర్తి జయంతి సందర్భంగా అతడి కుటుంబ సభ్యులు మంగళవారం గోవిందరావుపేట, పస్రా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. తండ్రి జ్ఞాపకార్థం ఇంద్రశేఖర్ 200 మంది రోగులకు పండ్లు పంపిణీ చేశారు

కుట్టు మిషన్లతో రాజకీయం

- కలెక్టర్ మంజూరు.. ప్రజాప్రతినిధుల పెత్తనం
- రెండేళ్లుగా పంపిణీ చేయని వైనం
- కుట్టు మిషన్ల కోసం మహిళల ఎదురుచూపులు



మహిళా సంఘం భవనంలో వృథాగా పడిఉన్న కుట్టు మిషన్లు

టేకుమట్ల : మహిళా సాధికారతే లక్ష్యంగా వారు ఆర్థిక సుస్థిరత సాధించేందుకు రెండేళ్ల క్రితం అప్పటి కలెక్టర్ భవేష్‌మిశ్రా మండలంలోని 24 గ్రామాల్లోని మహిళా సంఘ సభ్యుల కోసం రూ.20లక్షల నిధులను కేటాయించి కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఒక్కో గ్రామంలోని మహిళా సంఘం సభ్యుల్లో ఆసక్తి గల 10 మంది మహిళలకు శిక్షణనందించి కుట్టు మిషన్‌ను అందించాలనేది కలెక్టర్ లక్ష్యం. దీంతో మహిళలు ఆర్థికంగా ఎదగడంతో పాటు, కుటుంబానికి ఆసరాగా ఉంటారు. అందుకు అనుగుణంగా మండల సమాఖ్య ఆధ్వర్యంలో ప్రతీ గ్రామం సీఏల ఆధ్వర్యంలో 10 మందిని మహిళా సంఘ సభ్యులను ఎంపిక చేశారు. అప్పటి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి టేకుమట్ల, వెలిశాలలో ఒకరిద్దరికి పంపిణీ చేసి మళ్లీ కుట్టు మిషన్లను తిరిగి తీసుకుని పలు చోట్ల వాటిని నిల్వచేశారు. అంతలోనే లోక్‌సభ ఎన్నికల సమయం సమీపించడంతో మండల సమాఖ్య ఆధ్వర్యంలో కుట్టు మిషన్ల పంపిణీ లబ్ధిదారుల జాబితాను మార్చాలని అప్పటి బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులు పట్టుబట్టడంతో పంపిణీని పూర్తిగా నిలిపి వేశారు. అనంతరం ఎన్నికలు, కాంగ్రెస్ ప్రభుత్వం అధి కారంలోకి రావడంతో కుట్టు మిషన్ల పంపిణీని కాంగ్రెస్ నాయకులు తెరపై తీసుకు వచ్చారు. దీంతో మొదటి రెండు జాబితాల్లో రూపొందించిన లబ్ధి దారుల ఎంపిక మరోసారి మారనుందని మహిళా సంఘ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్ నిధులపై ప్రజా ప్రతినిధుల పెత్తనం..

మహిళల ఆర్థిక సుస్థిరతకు కలెక్టర్ ప్రత్యేక చొరవతో మహిళా సంఘ సభ్యులకు కేటాయించిన కుట్టు మిషన్ల పంపిణీపై ప్రజా ప్రతినిధుల పెత్తనంపై మహిళా సంఘ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళలకు అందించే కుట్టు మిషన్లను నిల్వ చేసి ఏడాది పైగా గడిచినప్పటికీ కుట్టు మిషన్లపై రాజకీయ రంగు పులమడం సరైంది కాదంటున్నారు. మండల సమాఖ్య ఆధ్వర్యంలో రూపొందించి న జాబితానే సరైందని, మొదటి జాబితా ప్రకారమే కుట్టు మిషన్లను అందించాలంటున్నారు. కాదని అధికార పార్టీ నాయకులకు చెందిన వారికి కేటా యిస్తే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని మండలంలోని పలువురు మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పార్టీలకతీతంగా మహిళా సంఘాల సభ్యులకు కలెక్టర్ పంపిణీ చేసిన కుట్టు మిషన్లను వెంటనే అందించాలని కోరుతున్నారు.


జాబితాలో పేరుంది..



“మహిళా సంఘాల సభ్యులకు కుట్టు మిషన్లను అందించేందుకు మండల సమాఖ్య ఆధ్వర్యంలో రూపొందించిన జాబితాలో నా పేరుంది. కుట్టు మిషన్ కోసం ఏడాదిపైగా ఎదురు చూస్తున్నాం. కలెక్టర్ పంపిణీ చేసిన మిషన్లను ఇప్పటి వరకు ఇవ్వడం లేదు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి మండల సమాఖ్య సీఏలు రూపొందించిన జాబితాలోని లబ్ధిదారులకు కుట్టు మిషన్లు పంపిణీ చేయాలి.

- గడ్డం సుమ, సంఘం సభ్యురాలు, టేకుమట్ల

రెండేళ్లుగా ఎదురు చూస్తున్నా..



గత ఎన్నికలకు ముందు మహిళల కోసం అప్పటి కలెక్టర్ పంపిణీ చేసిన కుట్టు మిషన్ల కోసం రెండు సంవత్సరాలకు పైగా ఎదురు చూస్తున్నాం. అప్పుడు పంపిణీ చేసిన, మళ్లీ మధ్యలో ఆగిపోయింది. వ్యవసాయ పనుల్లో ఇబ్బందిగా ఉంది. కుట్టు మిషన్ ఉంటే కొంచెం ఆసరాగా ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మహిళల కోసం వచ్చిన కుట్టు మిషన్లను వెంటనే పంపిణీ చేయాలి.

- దాసారపు సుమలత, సంఘ సభ్యురాలు, గర్మిళ్లపల్లి

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

ఎంఈఓ కొయ్యడ మల్లయ్య



శిక్షణలో మాట్లాడుతున్న మల్లయ్య

ఏటూరునాగారం : తరగతి గదుల్లో విద్యార్థులకు అర్థం అయ్యే రీతిలో ఉపాధ్యాయులు పాఠాలను బోధించాలని ఎంఈఓ కొయ్యడ మల్లయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీఎస్‌ఎస్‌లో ఐదు రోజులపాటు ఉపాధ్యాయులకు నిర్వహించే శిక్షణ తరగతులను మల్లయ్య ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. 8 మంది మండల రిసోర్స్ పర్సన్ల ద్వారా శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణలో నేర్చుకున్న బోధన మెళకువలను తరగతి గదిలో వినియోగించాలని తెలిపారు. అంతేకాకుండా ఐదు మండలాలకు వేర్వేరు గదుల్లో శిక్షణ కార్యక్రమం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో మంగపేటకు చెందిన ఎంఈఓ మేనక, కన్నాయిగూడెం శ్రీనివాసరావు, వెంకటాపురం(కె) జీవీవీ సత్యనారాయణ, వాజేడు వెంకటేశ్వరరావులతోపాటు మండల రిసోర్స్ పర్సన్లు రవి, బాలాజీ, లవన్‌కుమార్, నాయుడు, లావణ్య, సౌజన్య, రంజిత్‌కుమార్, లయీమ్ పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

ఏడీఏ అవినాష్‌వర్మ



రైతులకు సూచనలు చేస్తున్న ఏడీఏ అవినాష్‌వర్మ

ఏటూరునాగారం: డీలర్లు మేలు రకం నాణ్యమైన విత్తనాలు మాత్రమే రైతులకు విక్రయించాలని ఏటూరునాగారం డివిజన్ వ్యవసాయ సహాయ ఉప సంచాలకులు అవినాష్ వర్మ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల వ్యాప్తంగా ఎరువులు, విత్తనాల డీలర్లకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏడీఏ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మేలు రకం విత్తనాలు, నాణ్యమైన ఎరువులు మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. వాటికి సంబంధించిన రశీదు బిల్లులను కూడా రైతులకు ఇవ్వాలని తెలిపారు. అలాగే కొనుగోలు సమయంలో రైతులకు సలహాలు, సూచనలకు సంబంధించిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలన్నారు. రైతులు అధికృత డీలర్ల వద్దనే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. వారి వద్ద రశీదు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. అనుమతులు లేని దుకాణాల వద్ద రైతులు కొనుగోలు చేసి నష్టపోవద్దని సూచించారు. అంతేకాకుండా ధరల పట్టికలను కూడా తప్పకుండా ఏర్పాటు చేయాలని డీలర్లను ఏడీఏ అవినాష్ వర్మ ఆదేశించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠినచర్యలు

రేగొండ : నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి వాసుదేవారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో మండలంలోని విత్తన, ఎరువుల డీలర్లతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమతి పొందిన కంపెనీల విత్తనాలనే విక్రయించాలని, రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని తెలిపారు. డీలర్లు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల వివరాలు రోజువారిగా నమోదు చేయాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై పీడీ యాక్టు కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు మాళవిక, ప్రవీణ్, గోవర్ధన్, డీలర్లు పాల్గొన్నారు,

నిబంధనలు పాటించాలి: ఏఓ కల్యాణి

టేకుమట్ల : విత్తన డీలర్లు, ఫర్టిలైజర్ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించొద్దని ఏఓ కల్యాణి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో విత్తన డీలర్లు, ఫర్టిలైజర్ యజమానులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ షాపు యజమాని లైసెన్స్‌ను కలిగి ఉండాలన్నారు. అలాగే విత్తనాలను తప్పని సరిగా ఎంఆర్‌పీకే విక్రయించాలని, ధరల పట్టికను రైతులకు కనిపించేలా షాపు ఎదుట ప్రదర్శించాలన్నారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులకు తప్పని సరిగా బిల్లులు ఇవ్వాలని, అధిక ధరకు విక్రయిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతీ రోజు షాపు నిర్వాహకులు క్రయ విక్రయాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు రాహుల్, అరుణ్, యోగిత, భరత్, విత్తన డీలర్లు పాల్గొన్నారు.

డీలర్లు లైసెన్స్ కలిగి ఉండాలి

చిట్యాల : ఎరువులు, పురుగు మందులు విక్రయించే ప్రతీ డీలరు తప్పకుండా లైసెన్స్ కలిగి ఉండాలని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈసందర్భంగా మంగళవారం మండల కేంద్రలోని రైతు వేదికలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పురుగు మందుల షాపుల డీలర్లతో సమావేశం ఏర్పాటు చేసి చట్టాలపై అవగాహన కల్పించారు. లైసెన్స్ లేకుండా పురుగుల మందులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రమణ, వివిధ గ్రామాలకు చెందిన డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్

ములుగు రూరల్: కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి 44 కార్మిక చట్టాలను అమలు చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ కళాశాల ఆవరణలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంట కార్మికులకు ప్రభుత్వం రూ.600 మాత్రమే చెల్లిస్తూ శ్రమ దోపిడీకి గురిచేస్తుందన్నారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. సంఘటిత, అసంఘటిత కార్మికులు జూలై 9న దేశవ్యాప్తంగా చేపట్టిన సమ్మెలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు ముత్యాల రాజు, పోరెడ్డి ప్రమీల, సామల రమ, గున్నాల రాజకుమారి, భారతి, రాధిక, సమ్మక్క, సరోజన, పద్మావతి, లక్ష్మీ, మల్లక్క, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

● డీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

కాటారం : సరస్వతి పుష్కరాల్లో విధులు నిర్వర్తిస్తూ వడదెబ్బకు గురై మృతి చెందిన మండలంలోని గంగారం గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు మంతెన శ్రీనివాస్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్యాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం శ్రీనివాస్ మృతదేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వం రూ.35 కోట్లతో నిర్వహిస్తున్న పుష్కరాల్లో ఓ కార్మికుడు చనిపోతే ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. బాధిత కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని లేకపోతే ధర్మసమాజ్ పార్టీ పక్షాన ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

డీపీఓ పరామర్శ

పుష్కరాల్లో విధులు నిర్వర్తిస్తూ వడదెబ్బకు గురై మృతి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు శ్రీనివాస్ కుటుంబాన్ని మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి వీరభద్రయ్య పరామర్శించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గంగారంలోని శ్రీనివాస్ ఇంటికి వెళ్లిన డీపీఓ కుటుంబ సభ్యుల ఓదార్చి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని డీపీఓ పేర్కొన్నారు. ఉన్నతాధికారుల సూచన మేరకు పంచాయతీ కార్యదర్శి బీరెల్లి కరుణాకర్ తక్షణ సాయం కింద బాధిత కుటుంబానికి రూ.10వేలు అందజేశారు. గ్రామపంచాయతీ కార్మికుల యూనియన్ జిల్లా నాయకుడు మెండ మల్లికార్జునరావు, చిట్యాల శశికుమార్, పప్పుల లక్ష్మయ్య పాల్గొన్నారు.